E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు · జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON సంపుటి :01 సంచిక :104 సోమవారం 14 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## బీజేపీ-కాంగ్రెస్‌కు కేజ్రీవాల్ చెక్!

- కేజ్రీవాల్ కొత్త కూటమి ప్రకటన
- 'గోవా ఫస్ట్'గా కొత్త కూటమి
- బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం
- రెండు పార్టీల లాలూచీ రాజకీయాలపై ఫైర్
- గోవాలో అధికారమే లక్ష్యంగా దూకుడు
- ఆప్--జీఎఫ్‌పీ చేతులు కలిపాయి
- 2024లో కలిసి.. ఇప్పుడు కూటమిగా




2 లో

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** వినాయక చవితి పండుగ వేళ గోవా రాజకీయంలో భారీ సంచలనం నమోదైంది. వచ్చే ఏడాది జరగనున్న గోవా శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ, విజయ్ సర్దేశాయ్ నేతృత్వంలోని గోవా ఫార్వర్డ్ పార్టీ మధ్య పొత్తు ఖరారైంది. ఈ రెండు పార్టీలు ఉమ్మడిగా 'గోవా ఫస్ట్' పేరుతో కూటమిగా ఏర్పడినట్లు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికారికంగా ప్రకటించారు. ఆదివారం గోవా వేదికగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ మాట్లాడుతూ.. గోవాలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లాలూచీ రాజకీయాన్ని అంతమొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

**బీజేపీ, కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం:**

ఇన్నాళ్లూ గోవా ప్రజలకు బీజేపీ లేదా కాంగ్రెస్ తప్ప మరొక ప్రత్యామ్నాయం లేకపోయింది.

## నిరూపిస్తే రాజీనామా.. పొంగులేటికి పల్లా ఛాలెంజ్!

- భూముల ఆరోపణలు నిరూపిస్తే పదవికి రాజీనామా
- పొంగులేటికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి సవాల్
- 29 ఎకరాలు నావని నిరూపించగలరా?
- నిరూపించలేకపోతే మంత్రి పదవికి రాజీనామా చేయండి
- తనకు ఉన్నది ఎకరం 10 గుంటలేనన్న పల్లా
- భూదాన్ భూమి కాదని 2008లోనే ఎన్‌ఓసీ
- భూమి అమ్మలేదనే కక్ష సాధింపు చేస్తున్నారంటూ ఆరోపణ
- కేసీఆర్, హరీశ్‌రావులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

2 లో

## బ్రిక్స్ విందుపై కాంగ్రెస్ రచ్చ!

- 80 శాతం మంది నాన్‌వెజ్
- చోలే భటూరేపై రాహుల్ కామెంట్
- కాంగ్రెస్ నేతల నుంచి మద్దతు
- బీజేపీ ఆహార అభిరుచులు రుద్దుతోందని విమర్శ
- రాహుల్‌కు కిరణ్ రిజిజు కౌంటర్
- శాఖాహార వంటకాలను ఆస్వాదించిన నేతలు

2 లో


## స్కూల్లో బాలిక గర్భం ముగ్గురిపై వేటు!

2 లో

- బాలిక గర్భం ఘటనపై సర్కార్ సీరియస్
- ప్రిన్సిపల్ సహా ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ అధికారుల నిర్ధారణ
- హెచ్‌ఎం, వార్డెన్, టీచర్‌పై శాఖాపరమైన చర్యలు
- వంటమనిషిపై పోక్సో కేసు నమోదు
- పర్యవేక్షణ లోపంపై అధికారుల తీవ్ర ఆగ్రహం
- బాధిత బాలికకు వైద్యం.. కౌన్సెలింగ్

## గేర్ మార్చిన జనసేన

- తెలంగాణలో జనసేన స్పీడ్ పెంచింది
- త్వరలో పవన్ కల్యాణ్ పర్యటన
- 10 లోక్‌సభ స్థానాల్లో సమీక్షలు
- సంస్థాగత బలోపేతంపై ప్రత్యేక ఫోకస్
- ప్రతి ఎన్నికలో పోటీకి సిద్ధం
- 22ఏ భూములపై జనసేన పోరాటం
- పొత్తులపై కొనసాగుతున్న ఉత్కంఠ



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయ రంగస్థలంపై రాబోయే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ప్రధాన పార్టీలన్నీ వ్యూహ ప్రతివ్యూహాల్లో మునిగి తేలుతున్నాయి. ప్రజలకు చేరువయ్యేలా కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు తెలంగాణ పాలిటిక్స్ లో కాస్త సైలెంట్‌గా ఉంటూ వచ్చిన జనసేన ప్రస్తుతం గేర్ మార్చి స్పీడ్ పెంచుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణం, ప్రజాసమస్యలపై దూకుడుగా వ్యవహరించడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ఈ క్రమంలో త్వరలో తెలంగాణలో పవన్ కల్యాణ్ పర్యటించబోతున్నారంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ హీట్ పెంచుతోంది. తాజాగా ఓ చానల్ తో మాట్లాడిన రామ్ తాళ్లూరి.. తమిళనాడులో నటుడు విజయ్ సాధిస్తున్న రాజకీయ ఆదరణ తరహాలోనే, తెలంగాణలో పవన్ కల్యాణ్ కూడా ఒక బలమైన ప్రజాశక్తిగా ఎదిగారని పేర్కొన్నారు.

2 లో

## మాటల్లో ఉన్నంత స్ట్రాంగ్.. చేతల్లో లేదు!

- రేవంత్ మాటల్లో ఉన్నంత గట్టితనం చేతల్లో లేదు
- అంత గట్టితనం ఉంటే చాలామంది జైల్లో ఉండేవారు
- రేవంత్‌ది ఓపికగా ఎదురు చూసే స్వభావం
- ఆర్యవైశ్యులంటే సీఎంకు ఎంతో గౌరవం
- టీఎస్‌ను మార్చి టీజీ తెచ్చిన రేవంత్
- ఆత్మగౌరవ భవనానికి రూ.కోటి విరాళం
- ఆర్యవైశ్యులకు రాజకీయ పదవులు ఇవ్వాలి
- ప్రభుత్వాలను మార్చే సత్తా వైశ్యులకు ఉంది

2 లో

# కొండా వార్ కంటిన్యూ!




**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయం ఒక్కసారిగా హీటెక్కింది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన 13 రోజుల తర్వాత సైలెంట్ మోడ్ వీడిన మాజీ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళి ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యారు. ఆదివారం వరంగల్‌లో తమ అభిమానులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం వేదికగా సొంత పార్టీలోని ప్రత్యర్థులపై కొండా దంపతులు పేల్చిన పొలిటికల్ బాంబులు ఇప్పుడు గాంధీ భవన్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతున్నాయి. మంత్రి పదవి పోవడంతో కొండా దంపతులు కాంగ్రెస్ వీడి వేరే దారి చూసుకుంటారంటూ గత కొన్ని రోజులుగా జరుగుతున్న ఊహాగానాలకు చెక్ పెడుతూ.. కాంగ్రెస్‌ను వీడటం లేదు.

మిగతాది 2 లో..

- కొండా దంపతుల సంచలన ప్రకటన
- రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యం
- మళ్లీ వరంగల్ ఈస్ట్ నుంచే పోటీ!
- మళ్లీ మంత్రి అవుతా.. సురేఖ సవాల్
- పార్టీలోని ప్రత్యర్థులపై ఫైర్
- గుంటనక్కలంటూ సొంత నేతలపై విరుచుకుపాటు
- మీనాక్షి ఫోన్ తర్వాతే స్పీడ్ పెరిగిందా?
- జిల్లా నేతలా.. స్టేట్ లీడర్లా?

## గ్లోబల్ సౌత్‌కు మోదీ పిలుపు!

- రూల్ టేకర్ నుంచి రూల్ షేపర్‌గా
- గ్లోబల్ సౌత్‌కు నిర్ణయాధికారం
- యూఎన్ భద్రతా మండలిలో ప్రాతినిధ్యం
- ప్రపంచ పాలనలో సంస్కరణలు రావాలి
- యువ డిప్లొమాట్లకు శిక్షణ
- నావికుల రక్షణకు కొత్త నెట్‌వర్క్
- న్యూఢిల్లీ బ్రిక్స్ డిక్లరేషన్ ఆమోదం
- వాగ్దానాలు కాదు.. ఫలితాలు కావాలి




2 లో

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** గ్లోబల్ సౌత్ దేశాలు రూల్ టేకర్ నుంచి రూల్ షేపర్‌గా మారాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. 'బ్రిక్స్' సదస్సు రెండో రోజులో భాగంగా 'సమ్మిళిత ప్రపంచ పాలన, బహుపాక్షికత పటిష్టత' అనే అంశంపై సదస్సుకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు, గ్లోబల్ సౌత్ దేశాల హక్కులపై ఆయన గళం వినిపించారు.

**నిర్ణయాధికారంలో గ్లోబల్ సౌత్‌కు చోటు..**

ప్రపంచ సంక్షోభాల ప్రభావం గ్లోబల్ సౌత్ దేశాలపైనే ఎక్కువగా ఉంటోందని, కానీ నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలో మాత్రం ఆ దేశాలు వెనుకబడి ఉన్నాయని ప్రధాని మోడీ అన్నారు.

## సినిమాను మించిన ఇన్వెస్టిగేషన్!

- 11 రోజుల థ్రిల్లర్ దర్యాప్తు
- 500 సీసీ కెమెరాల జల్లెడ
- నీడలను కూడా అనుమానించిన పోలీసులు
- సెకన్ టు సెకన్ ఫుటేజ్ స్కాన్
- టైమ్ గ్యాప్‌తో నిందితుడి గుర్తింపు
- మాజీ సైనికుడి పాత్ర వెలుగులోకి
- 12 తుపాకులు.. 2 వేల బుల్లెట్లు స్వాధీనం



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారం మిలటరీ మద్రాసు రెజిమెంట్ వెపన్స్ చోరీ కేసులో హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులతో పాటు మిలటరీ అధికారులు, రాష్ట్రంలోని వివిధ పోలీసు విభాగాలు, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలు జరిపిన ఇన్వెస్టిగేషన్ ఇప్పుడు అత్యంత ఆసక్తిని రేపుతోంది. ఈ మిస్టరీ చేధన వెనకాల సాగిన పోలీసుల కష్టం, దర్యాప్తు సంస్థల ఉన్నతాధికారుల మేధోమధనంతో సాగిన విచారణ ఉత్కంఠను రేపే సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపించే విధంగా జరిగిందని ఇప్పుడు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రా పోలీసులతో పాటు ఇతర దర్యాప్తు సంస్థల అధికారుల్లో టాక్. 11 రోజుల పాటు సాగిన ఈ ఇన్వెస్టిగేషన్ ఇప్పుడు ఓ హిస్టరీ గా గుర్తింపు తెచ్చుకుందని స్పష్టమవుతుంది.

2 లో

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల!



2 లో

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష తుది ఫలితాలు , ఫైనల్ ఆన్సర్ కీలను విద్యాశాఖ అధికారికంగా విడుదల చేసింది. గత నెలలో జరిగిన ఈ కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు లక్షలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు.

## డీఎస్సీపై జగన్ బిగ్ కౌంటర్!



2 లో

- చంద్రబాబు వివరణలతో మరిన్ని ప్రశ్నలంటూ ఫైర్
- 65 మార్కులకే టీచర్ పోస్టు ఎలా ఇచ్చారు?
- ఏడు దశల వెరిఫికేషన్ ఎలా పూర్తయింది?
- టెట్‌లో 65 మార్కులు వచ్చినా ఉద్యోగమా?
- డీఎస్సీ ప్రక్రియపై జగన్ సంచలన ప్రశ్నలు
- రోజుకో పోస్టుతో చంద్రబాబుపై జగన్ దాడి
- డీఎస్సీపై సమాధానం చెప్పాలంటూ నిలదీత

## కొండా వార్ కంటిన్యూ!

మొదటి పేజీ తరువాయి

రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే మా లక్ష్యం అని స్పష్టం చేశారు. అదే సమయంలో వచ్చే ఎన్నికల్లో మళ్లీ వరంగల్ ఈస్ట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తీరుతానని, మళ్లీ మంత్రిని కూడా అవుతానని సురేఖ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి.

కొండా ఫైర్ వెనుక ఎవరు?:

ఇవాళ సమావేశంలో మాట్లాడిన కొండా సురేఖ సొంత పార్టీలోని తన ప్రత్యర్థులపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీలో కొన్ని గుంటనక్కలు ఉన్నాయని, కానీ నిన్న మొన్న వచ్చిన వారు సైతం మాపై మాట్లాడుతున్నారు అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వరంగల్ సీనియర్ నేతలైన కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య, నాయిని రాజేందర్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లోనూ తమ అనుచరులకే కాంగ్రెస్ టికెట్లు ఇచ్చేది మేమేనని, మా వారే గెలుస్తారంటూ కొండా దంపతులు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత సంచలనం రేపుతున్నాయి. అయితే నిన్నా మొన్నటి వరకు సైలెంట్‌గా ఉన్న కొండా దంపతులు ఆల్ ఆఫ్ సడెన్ గా ఇలా విరుచుకుపడటం వెనుక ఏం జరుగుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

మీనాక్షి ఫోన్ తర్వాత స్పీడ్:

తాజా పరిణామాల నేపథ్యంలో ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ కొండా సురేఖకు ఫోన్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ఫోన్ కాల్ తర్వాతే కొండా దంపతులు తమ అనుచరులతో సమావేశమైన కాంగ్రెస్ పార్టీని వీడేది లేదని చెప్పడంతో పాటు పార్టీలో ఉన్న తమ వ్యతిరేక వర్గంపై ఘాటు విమర్శలు చేయడం చర్చనీయాశం అవుతోంది. అధిష్ఠానం భరోసాతోనే కొండా దంపతులు ఈ రకంగా మాట్లాడారా లేక ఏది జరగాల్సి ఉంటే అది జరుగుతుందని ఈ విధంగా మాట్లాడారా అనేది సస్పెన్స్ గా మారింది.

జిల్లా నాయకులా? స్టేట్ లీడర్లా?:

కొండా దంపతులు చేసిన తాజా వ్యాఖ్యలను బట్టి కాంగ్రెస్ లోనే ఉంటూ రాజకీయం చేయబోతున్నట్లు స్పష్టం అవుతోంది. అయితే పార్టీలో కొనసాగుతూనే పార్టీకి చెందిన తమ వ్యతిరేక వర్గంపై చాలెంజ్ లు విసరడం అధికార పార్టీకి కొత్త తలనొప్పులు తేక మానదు. ఇప్పటికే ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శల దాడి ఎదురవుతున్న తరుణంలో కొండా దంపతులు టార్గెట్ పాలిటిక్స్ కు తెరలేపితే అది అంతిమంగా ఎవరికి డ్యామేజ్ చేయనుంది అనేది సస్పెన్సే. మొత్తంగా కొండా దంపతుల వ్యాఖ్యల వెనుక వారి టార్గెట్ ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ లోని తమ వ్యతిరేక నాయకులా లేక రాష్ట్ర స్థాయిలో మరెవరిపైనైనా గురి పెట్టారా? అన్నదే ఇప్పుడు హస్తం పార్టీలో హాట్ టాపిక్‌గా మారింది.

## గ్లోబల్ సౌత్‌కు మోదీ పిలుపు!

మొదటి పేజీ తరువాయి

పిరమిడ్ ఆఫ్ ప్రివిలేజ్ ను ప్లాట్‌ఫార్మ్ ఆఫ్ పార్టనర్‌షిప్ గా మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. నేటి ప్రపంచ వాస్తవాలకు తగ్గట్టుగా గ్లోబల్ గవర్నెన్స్ మారాలని, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వంటి కీలక సంస్థల్లో గ్లోబల్ సౌత్ దేశాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రధాని మోదీ డిమాండ్ చేశారు.

**రూల్-టేకర్ నుంచి రూల్-షేపర్‌గా..**

గ్లోబల్ సౌత్ దేశాలు కేవలం నిబంధనలను పాటించేవిగా కాకుండా, నిబంధనలను రూపొందించే శక్తిగా ఎదగాలని తెలిపారు. బ్రిక్స్ వేదిక ద్వారా గ్లోబల్ సౌత్ దేశాలకు చెందిన యువ డిప్లొమాట్లు, విధానకర్తలకు సముచితమైన చర్చల నైపుణ్యాలు, శిక్షణ అందించవచ్చని అన్నారు. అదేవిధంగా ప్రపంచ వాణిజ్యానికి విశేష సేవలందిస్తున్న నావికులు సంక్షోభ సమయాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. వారి రక్షణ కోసం సీఫేరర్స్ ఎమర్జెన్సీ సపోర్ట్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. మన భవిష్యత్తు ఉమ్మడిదే అయినప్పుడు, ఆ భవిష్యత్తును తీర్చిదిద్దే హక్కు కూడా అందరిదీ కావాలని ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సమావేశం ముగింపులో సభ్య దేశాల అంగీకారంతో న్యూఢిల్లీ బ్రిక్స్ లీడర్స్ డిక్లరేషన్ ఆమోదించబడింది.

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా ముగిసింది. ముగింపు సమావేశంలో ప్రసంగించిన ప్రధాని నరేంద్రమోడీ.. సదస్సుకు హాజరైన 21 దేశాల అధినేతలకు, ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. నెక్స్ట్ జరగబోయే బ్రిక్స్ సదస్సుకు చైనా ఆతిథ్యం ఇవ్వనుండటంతో.. ఆ దేశ ప్రధానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి.. సమ్మిళిత అభివృద్ధిని సాధించేందుకు బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత కీలకమని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఘర్షణల వల్ల సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆవేదన చెందారు. అలాగే లేటెస్ట్ టెక్నాలజీ, కొన్ని కీలకమైన ఖనిజాలను కొన్నిశక్తులు ఆయుధాలుగా మార్చుకోవడంపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు. ఇక బ్రిక్స్ కూటమి మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో.. బ్రిక్స్ కూటమి నుంచి ప్రపంచం ఆలోచనలు, వాగ్దానాలు కాకుండా ఉపయోగపడే ఫలితాలను ఆసిస్తోందని మోదీ స్పష్టం చేశారు.

## మాటల్లో ఉన్నంత స్ట్రాంగ్.. చేతల్లో లేదు!



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడినంత గట్టితనం ఆయన చేతల్లో ఉండదని ఏపీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అదే గట్టితనం ఉంటే తెలంగాణలో ఈపాటికి ఎంతో మంది కటకటాల వెనక్కి వెళ్లిపోయేవారన్నారు. చాలా ఓపికగా ఎదురు చూసి ముందుకు పోయే స్వభావం కలిగిన వాడు రేవంత్ రెడ్డి అన్నారు. ఇళ ఉప్పల్ భగాయత్ లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సీఎం చేత భూమి పూజ కార్యక్రం జరిగింది. ఈకార్యక్రమానికి హాజరైన టీజీ వెంకటేశ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్యవైశ్యలంటే రేవంత్ రెడ్డికి చాలా గౌరవం ఉందన్నారు. గతంలో నేను సమైక్యఆంధ్ర పోరాటానికి శ్రీకారం చుట్టాను. అయితే అది మమ్మల్నీ బయటకు పంపొద్దని మీతో కలిసి ఉంచమని ఈ ఉద్యమాన్ని ప్రారంభించానన్నారు. తన పేరులో టీజీ ఉంటే తెలంగాణ రాగానే రాష్ట్రానికి సంక్షిప్త నామం టీజీ తొలగించి టీఎస్ గా మార్చారు. రేవంత్ రెడ్డి వచ్చి మళ్లీ టీజీ తీసుకువచ్చి మా ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని మా తాత ముత్తాతలు తెలంగాణ నుంచి వచ్చిన వారేనన్నారు. ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తన వంతు విరాళంగా రూ.కోటి ఇస్తున్నట్లు ప్రకటించారు.

పదువులు ఇవ్వండి:

ఆర్యవైశ్యులకు పదవులు ఇవ్వాలని టీజీ వెంకటేశ్ కోరారు. రాజకీయంగా ఏదైనా పోరాటాల్లో వైశ్యులు ముందుకు రారు అనే అభిప్రాయం ఉందని కానీ ప్రభుత్వాలను మార్చడంలో పబ్లిక్ టాక్ చేయడంలో మావారు ఆరితేరినవారు అని అన్నారు. వైశ్యులంతా ట్రేడింగ్ కమ్యూనిటి కావడం వల్ల షాపులకు వచ్చే వారితో ముచ్చటిస్తూనే ప్రభుత్వాలకు అనుకూలం వ్యతిరేకం నిర్ణయించేది వైశ్యులేనన్నారు.

## స్కూల్లో బాలిక గర్భం.. ముగ్గురిపై వేటు!

**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** పోలవరం జిల్లా అడ్డతీగల మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇటీవల ఓ విద్యార్థిని గర్భం దాల్చిన ఘటన వెలుగుచూసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు గాను స్కూల్ ప్రిన్సిపల్ సహా ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనపై గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య వివరాలు వెల్లడించారు. స్కూల్ హెచ్ఎం దూడ శాంతమతి, హాస్టల్ వార్డెన్ పల్లాల విజయగంధం, స్కూల్ టీచర్ కాకూరి లోవమ్మలను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. స్కూల్ సిబ్బంది నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగానే బాలిక గర్భం దాల్చినట్లుగా గుర్తించామన్నారు. ఈ దారుణానికి పాల్పడిన వంటమనిషి మంగరాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా.. బాధిత బాలికకు అవసరమైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ జరుగుతోందని, శాఖాపరమైన విచారణపై నివేదిక వచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సినిమాను మించిన ఇన్వెస్టిగేషన్!

మొదటి పేజీ తరువాయి

నీడను ఫాలో అయ్యారు..

ఈ కేసు దర్యాప్తులో భాగంగా హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దాదాపు 500 సీసీ కెమెరాలను నిశితంగా గమనించారు. 29, 30వ తేదీ రాత్రులకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను సెకన్ టూ సెకన్ పోలీసులు స్కానింగ్ చేశారు. వీటిని చూస్తున్న పోలీసులు రాత్రి సమయంలో లైట్ వెలుతురుకు వచ్చే నీడలను కూడా అనుమానించి వాటిని కూడా విశ్లేషించుకున్నారు. ఇలా దాదాపు ఒక 20 నుంచి 30 వరకు నీడలను కూడా అనుమానంతో మ్యాపింగ్ చేసుకుని పోలీసులు ఫాలో అయ్యారు. చివరకు అవి మనుషులు కాదని, ఇతర వస్తువులకు సంబంధిచన షాడోలన్ని గుర్తించారు. ఇలా అన్ని కోణాల్లో పోలీసులు సీసీ కెమెరాల ద్వారా సేకరించిన ప్రాథమిక ఆధారాలతో టైం గ్యాప్ మేనేజ్ మట్న్మెంట్ ప్రక్రియతో మ్యాపింగ్ చేసి అనుమానితుడు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్‌ను గుర్తించి అతనిని షాడో చేసి.. చివరకు మిస్టరీని చేధించారు. ఒక నైట్ ఫుటేజ్‌ను జల్లెడ పట్టేందుకు పోలీసులు కంటిన్యూగా రెండు రోజుల పాటు విడియోలు చూస్తు ఉండిపోయారని పోలీసు అధికారులు తెలిపారు.

తాజాగా ఆర్మ్స్ యాక్ట్ సెక్షన్ నమోదు..

బొల్లారం మిలటరీ వెపన్స్ మిస్సింగ్ సంఘటనపై బొల్లారం పోలీసులు ముందుగా చోరీ కేసును నమోదు చేశారు. నిందితుడు మాజీ సైనిక ఉద్యోగి మల్లేష్ అరెస్టు తర్వాత దర్యాప్తులో వెలుగు చూసిన ఆధారాలతో అతనిపై ఆర్మ్స్ యాక్ట్ కింద అభియోగాన్ని నమోదు చేశారు మల్లేష్ నుంచి మిస్సింగ్ అయిన 12 తుపాకులు, 2 వేల బుల్లెట్‌లు, నైట్ విజన్ బైనాక్యులర్, మ్యాగజైన్ లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వీటిని కోర్టుకు అప్పజెప్పనున్నారు. రిమాండ్‌లో ఉన్న మల్లేష్‌ను మరోసారి కస్టడీలోకి తీసుకుని ఈ వెపన్స్ మిస్సింగ్ వెనకాల ఏమైనా ఇతర కుట్రలు దాగి ఉన్నాయనే అంశాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నించనున్నారు.

## బీజేపీ-కాంగ్రెస్‌కు కేజ్రీవాల్ చెక్!

మొదటి పేజీ తరువాయి

కానీ ప్రజలు కోరుకుంటున్న అసలైన, పటిష్టమైన ప్రత్యామ్నాయం 'గోవా ఫస్ట్' కూటమితో సాకారమైందన్నారు. మేం మా స్వశక్తిపైనే ఈ ఎన్నికల్లో పోటీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ ఫిరాయింపుదారులతోనే నడుస్తోంది. దానికి ఎటువంటి సిద్ధాంతాలు లేవు. ఇది కేవలం సొంత జేబులు నింపుకునే 'పాకెట్ ఫస్ట్' ప్రభుత్వం మాత్రమేన్నారు. ఒక నిజమైన బీజేపీ ఓటరు ఎప్పటికీ కాంగ్రెస్‌కు ఓటు వేయరు. బీజేపీ పాలనపై ఎంత నిరాశ ఉన్నా వారు మా 'గోవా ఫస్ట్' కూటమిని ఆదరిస్తారు కానీ కాంగ్రెస్‌ను మాత్రం నమ్మరని కీలక వ్యాఖ్యలు చేశారు.

**గోవా రాజకీయంలో మలుపులు:**

తాజా కూటమి ఏర్పాటు నేపథ్యంలో గోవా కూటమి రాజకీయాల్లో అనేక మలుపు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2017లో ఎన్నికల అనంతరం గోవా ఫార్వర్డ్ పార్టీ బీజేపీతో చేతులు కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా 2022 శాసనసభ ఎన్నికల్లో గోవా ఫార్వర్డ్ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. ఆ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా బరిలోకి దిగింది. ఇక 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్, జీఎఫ్‌పీ కలసి పోటీ చేశాయగా ప్రస్తుతం రాబోయే ఎన్నికల కోసం ఆప్, జీఎఫ్‌పీ కలసి 'గోవా ఫస్ట్' రూపంలో కొత్త ప్రత్యామ్నాయంగా అవతరించాయి. దీంతో గోవా రాజకీయంలో చోటుచేసుకుంటున్న ఈ వరుస మార్పులు మాండోవి నది మలుపుల కంటే మించిన మలుపులు ఈ కూటమి రాజకీయాల్లో కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇకపై 100 సార్లు చెక్ చేసుకుంటాం:**

ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్ సహా 7 మంది రాజ్యసభ ఎంపీల ఫిరాయింపు ఘటనపై కేజ్రీవాల్ తొలిసారి బహిరంగంగా స్పందించారు. మా పార్టీ ద్వారానే వారు రాజ్యసభకు వెళ్లారు. ప్రజలు వారిని నేరుగా ఎన్నుకోలేదు. పార్టీకి వారు తీవ్రమైన ద్రోహం చేశారన్నారు. ఈ పరిణామం మా ఎంపిక విధానంలో ఉన్న బలహీనతను చూపించిందని, ఇది ఆప్‌కు ఒక పెద్ద పాఠం అన్నారు. ఇకపై ఎవరినైనా రాజ్యసభకు పంపే ముందు వారు నమ్మదగినవారా లేదా అని 100 సార్లు వారి విశ్వసనీయతను తనిఖీ చేశాకే నిర్ణయం తీసుకుంటామన్నారు.

## గేర్ మార్చిన జనసేన

మొదటి పేజీ తరువాయి

దీంతో జరుగుతున్న తాజా పరిణామాలు తెలంగాణ పాలిటిక్స్ లో ఎలాంటి సంచలనాలకు కేరాఫ్ కాబోతోంది అనేది ఉత్కంఠ రేపుతోంది.


**వ్యూహం మార్చిన జనసేన:**

ఆంధ్రప్రదేశ్‌లో సత్తా చాటిన తర్వాత జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పుడు తెలంగాణ రాజకీయంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి ఇచ్చిన దిశానిర్దేశంతో తెలంగాణ నాయకత్వం నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని 10 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో సమీక్షా సమావేశాలను విజయవంతంగా పూర్తి చేసి, సంస్థాగత బలాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. త్వరలోనే పవన్ కళ్యాణ్ తెలంగాణలో పర్యటించనున్నట్లు సంకేతాలు వెలువడటంతో కేడర్‌లో సరికొత్త ఉత్సాహం నిండింది. రాష్ట్రంలో జరగబోయే ప్రతి ఎన్నికల్లో పోటీ చేస్తామని జనసేన తెలంగాణ నాయకత్వం పదే పదే చెబుతూ వస్తోంది. త్వరలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అందరికంట్టె ముందే అభ్యర్థిని ప్రకటించింది. ఆపై జరగనున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పాటు కార్పొరేషన్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమే టార్గెట్‌గా పెట్టుకుంది. ఇందుకోసం పొత్తులపై కూడా చర్చలు సాగుతున్నాయని ఆ పార్టీ ముఖ్య నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతాలిచ్చినట్లవుతోంది. దీంతో తెలంగాణలో పొత్తుల రాజకీయం మరోసారి తెరపైకి వస్తోంది. ఇప్పటివరకు తెలంగాణలో కేవలం పవన్ కల్యాణ్ అభిమానులతోనే నెట్టుకు వస్తున్న జనసేన.. ఇప్పుడు పక్కా రాజకీయ వ్యూహంతో ముందుకు వెళ్తున్నట్లు కనిపిస్తోంది. పార్టీలో చేరికలపై దృష్టి సారిస్తూనే ప్రజాక్షేత్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న 22ఏ భూముల సమస్య, ఫీజు రీయింబర్స్ మెంట్ లాంటి ట్రెండింగ్ అంశాలపై రోడ్డెక్కి పోరాడుతోంది. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ ముట్టడి ప్రయత్నం పొలిటికల్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**పొత్తు ఎవరితో?:**


జనసేన తెలంగాణలో పోటీ చేయడం కంటే ఆ పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకోబోనుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. ఏపీలో టీడీపీ, బీజేపీ తో కలిసి కూటమిలో ఉన్న జనసేన తెలంగాణలో ఎలాంటి వ్యూహంతో రాబోతోంది అనేది అందరి మదిలో మెదులుతున్న ప్రశ్న. జనసేన పొత్తుల అంశం తెర మీదకు తీసుకువచ్చిన ప్రతిసారి తెలంగాణ బీజేపీ ఏదో రకంగా ఖండిస్తోంది. మరి పవన్ కళ్యాణ్ త్వరలో తెలంగాణలో పర్యటిస్తే ఈ పొత్తులపై ఏమైనా క్లారిటీ రానుందా? లేక పవన్ సైన్యం ఒంటరిగా బరిలోకి దిగుతుందా? అనేది తేలాల్సి ఉంది.

## డీఎస్సీపై జగన్ బిగ్ కౌంటర్!



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** రాష్ట్రంలో జరిగిన డీఎస్సీపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎక్స్‌లో రోజుకో పోస్టు చేస్తూ సీఎం చంద్రబాబుపై ఆయన మాటల దాడి పెంచారు. పైగా డీఎస్సీపై చంద్రబాబు ఇస్తున్న వివరణలు మరిన్ని ప్రశ్నలకు అవకాశం కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 65 మార్కులు, 7 దశల వెరిఫికేషన్.. 65 మార్కులు టెట్లో వచ్చినా టీచరు పోస్టు ఇచ్చారని విమర్శించారు. అంతకుముందు ఆ అభ్యర్థి 7 దశల వెరిఫికేషన్ ఎలా పూర్తి చేశాడు అని వైఎస్ జగన్ ప్రశ్నించారు.

## బ్రిక్స్ విందుపై కాంగ్రెస్ రచ్చ!



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** న్యూఢిల్లీ వేదికగా జరిగిన బ్రిక్స్ సమావేశాలు ముగిశాయి. ఇప్పుడు ఇక రాజకీయమే మిగిలింది. కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ట్వీట్ రాజకీయ వేడి పుట్టించింది. బ్రిక్స్ సదస్సులో విదేశీ నేతలకు వడ్డించిన శాఖాహార విందు మెనూపై ఆయన విమర్శలు గుప్పించారు. దేశంలో 80 శాతం మంది భారతీయులు నాన్-వెజ్ ఆహారం తీసుకుంటారని ఆయన వ్యాఖ్యానించారు. దీంతో ఈ డిన్నర్ మెనూపై రాజకీయంగా మాటల యుద్ధం మొదలైంది.

"రికార్డు కోసం చెబుతున్నాను.. 80 శాతం మంది భారతీయులు నాన్-వెజిటేరియన్లు. భారతీయ నాన్-వెజిటేరియన్ వంటకాలు ఎంతో రుచికరంగా ఉంటాయి. అలాగే నా సోదరి చేసే చోలే భటూరే కూడా" అంటూ రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనితో పాటు చోలే భటూరే ఫోటోను కూడా షేర్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలకు మరో కాంగ్రెస్ నేత పవన్ ఖేరా మద్దతు తెలిపారు. భారతదేశంలోని వంటకాల వైవిధ్యంలో ప్రపంచ స్థాయి మాంసాహార వంటకాలు కూడా ఉన్నాయని అన్నారు. అలాంటి వంటకాలను విదేశీ నేతలకు ఎందుకు పరిచయం చేయలేదు అని ప్రశ్నించారు. భారతీయులపై బీజేపీ తన ఆహారపు అభిరుచుల్ని రుద్దుతోందని, ఇప్పుడు విదేశీ నేతలు, అతిథులపై కూడా ఇదే జరుగుతోందని విమర్శించారు.

అయితే, ఈ కామెంట్లకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఘాటు సమాధానం ఇచ్చారు. బ్రిక్స్ దేశాధినేతలు భారతీయ శాఖాహార వంటకాలను ఆస్వాదించారని అన్నారు. బ్రిక్స్ దేశాల నేతలకు వడ్డించిన ఆహార మెనూపై కాంగ్రెస్ రాజకీయాలు చేస్తుందంటే నమ్మలేకపోతున్నాను అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దేశంలో వివిధ ప్రాంతాలను ప్రతిబింబించేలా ఈ శాఖాహార మెనూను రూపొందించినట్లు ఆయన చెప్పారు. రుచితో పాటు పోషక విలువలకు కూడా ప్రాధాన్యం ఇచ్చామని అన్నారు.

**విందు మెనూలో ఏమున్నాయి..?**

బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ఇచ్చిన విందులో పూర్తిగా శాఖాహార వంటకాలను వడ్డించారు. మెనూలో ఖాండ్వీ, పనీర్ లబాబ్దార్, గుచ్చి మార్మిక్, మిల్లెట్ పులావ్, మష్రూమ్ గలౌటీ, జిలేబీ వంటి వంటకాలు ఉన్నాయి. మిల్లెట్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. భారత్ ప్రోత్సహిస్తున్న "శ్రీ అన్న" పాటు సుస్థిర ఆహార విధానాన్ని కూడా ఈ మెనూలో ప్రతిబింబించేలా రూపొందించారు.

## ఏపీ టెట్ ఫలితాలు విడుదల!

మొదటి పేజీ తరువాయి

ప్రాథమిక కీపై అభ్యంతరాల పరిశీలన ముగిసిన అనంతరం ఫైనల్ స్కోర్ కార్డులను అధికారులు అందుబాటులో ఉంచారు. రాబోయే డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉండటంతో ఈ ఫలితాలు అభ్యర్థులకు అత్యంత కీలకం.

ఫలితాలు చెక్ చేసుకునేందుకు అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://tet2dsc.apcfss.in/ లింక్‌ను బ్రౌజర్‌లో ఓపెన్ చేయాలి. వెబ్‌సైట్ హోమ్‌పేజీలో ఉన్న 'క్యాండిడేట్ లాగిన్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అక్కడ మీ రిజిస్టర్డ్ యూజర్ నేమ్ లేదా హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేయాలి. పాస్‌వర్డ్ లేదా పుట్టిన తేదీని నిర్దిష్ట ఫార్మాట్‌లో ఎంటర్ చేయాలి. పక్కనే కనిపించే క్యాప్చా కోడ్‌ను సరిగ్గా టైప్ చేసి 'లాగిన్' బటన్ ప్రెస్ చేయాలి. యూజర్ ఐడీ లేదా పాస్‌వర్డ్ మర్చిపోయినవారు పేజీలోని రికవరీ ఆప్షన్ ద్వారా మొబైల్ లేదా ఈమెయిల్ సహాయంతో తిరిగి పొందవచ్చు.

లాగిన్ అయిన తర్వాత మీ ప్రొఫైల్ ఓపెన్ అవుతుంది. అక్కడ 'డౌన్‌లోడ్ మార్క్స్ మెమో' లేదా స్కోర్ కార్డు లింక్ ఉంటుంది. దానిపై క్లిక్ చేసి పీడీఎఫ్ ఫార్మాట్‌లో స్కోర్ కార్డ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పేపర్-1, పేపర్-2 స్కోర్లు విడివిడిగా డిస్ప్లే అవుతాయి. కేటగిరీ వారీగా కటాఫ్ మార్కులు దాటినవారు అర్హత సాధించినట్లుగా నిర్ధారిస్తారు. డౌన్‌లోడ్ చేసిన మెమో హార్డ్ కాపీని ప్రింట్ తీసుకుని డీఎస్సీ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు జాగ్రత్తగా దాచుకోవాలి. సర్వర్ రద్దీగా ఉంటే కొద్దిసేపు ఆగి మళ్లీ ప్రయత్నించాలి. అభ్యర్థులు అనధికారిక లింక్‌లను నమ్మకుండా కేవలం ఈ అధికారిక పోర్టల్ ద్వారా మాత్రమే మార్కుల మెమో పొందాలి. ఫైనల్ కీలో మార్పులు పరిగణనలోకి తీసుకుని ఈ మెమోను జారీ చేశారు.

## నిరూపిస్తే రాజీనామా.. పొంగులేటికి పల్లా ఛాలెంజ్!



**న్యూస్ డెస్క్, 13 సెప్టెంబరు (తెలుగు గళం):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర అహంకారంతో వ్యవహరిస్తూ, బీఆర్‌ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, ఇతర నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీష్ రావు అధ్యక్షతన జరిగిన మీడియా సమావేశంలో పల్లా మాట్లాడారు. జనగామలో హరీష్ రావుతో కలిసి రెవెన్యూ శాఖలోని అక్రమాలను తాము బయటపెట్టినందుకే కక్ష సాధింపు చర్యలలో భాగంగానే తమపై, బీఆర్‌ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

వట్టినాగులపల్లిలోని సర్వే నంబర్ 188లో రూ.3 వేల కోట్ల విలువైన 29 ఎకరాల భూదాన్ భూమిని తాను ఆక్రమించానని పొంగులేటి చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధాలని పల్లా కొట్టిపారేశారు. ఆ 29 ఎకరాల భూమి తనదేనని నిరూపిస్తే నిమిషంలో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు. ఒకవేళ నిరూపించలేకపోతే పొంగులేటి తన మంత్రి పదవికి రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నారా అని నిలదీశారు. రూ.3 వేల కోట్ల విలువైన భూమి అని చెబుతున్న పొంగులేటి, రూ.10 కోట్లో లేదా రూ.50 కోట్లో ఇచ్చి ఆ భూమిని తీసుకోవడానికి సిద్ధమైతే ఏ కాగితంపై అయినా సంతకం పెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు.

వట్టినాగులపల్లిలో తనకు ఉన్నది కేవలం ఎకరం 10 గుంటల భూమి మాత్రమేనని పల్లా వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందే ఆ భూమికి సంబంధించి ఒప్పందం చేసుకుని, జూన్ 2014లో చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. ఆ భూమి భూదాన్ పరిధిలోకి రాదని 2008లోనే భూదాన్ యజ్ఞ బోర్డు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిందని, సంబంధిత కోర్టు కూడా స్పష్టతనిచ్చి అధికారులను మార్పులు చేయాలని ఆదేశించిందని గుర్తుచేశారు.

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బినామీలు నా వద్దకు వచ్చి ఆ ఎకరం 10 గుంటల భూమిని విక్రయించాలని ఒత్తిడి తెచ్చారని, తాను అమ్మడానికి నిరాకరించడంతోనే కక్ష కట్టారని పల్లా ఆరోపించారు. కేవలం 10 నుంచి 15 రోజుల వ్యవధిలోనే తన భూమితో పాటు ఇతర భూములను 22ఏ (నిషేధిత) జాబితాలో చేర్చి బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ అంశంపై తాము కోర్టును ఆశ్రయించగా, ఆ భూమిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రవేశించవద్దని కోర్టు అధికారులను ఆదేశించిందని చెప్పారు. కేసీఆర్, హరీష్ రావులపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు పొంగులేటి తక్షణమే క్షమాపణలు చెప్పాలని, లేకపోతే తెలంగాణ ప్రజలే ఆయన అహంకారానికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# వార్డు సభ్యుల ఫోరం రేగొండ మండల ఇన్‌చార్జిగా రేసోజు శివరాజ్

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**



తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం మండల కమిటీ విస్తరణలో భాగంగా రేగొండ మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నాగబెల్లి జ్యోతి మహేష్ ఆదేశాల మేరకు,జిల్లా ఇన్‌చార్జి బోయిని శ్రీజ రజినీకుమార్ పర్యవేక్షణలో ఈ సమావేశం జరిగింది.భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ రేణికుంట్ల రమణ కుమార్,కో-కన్వీనర్ మారపల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ భేటీలో మండల ఇన్‌చార్జిగా రేసోజు శివరాజ్‌ను ఏకగ్రీవంగా నియమించారు.తన నియామకానికి సహకరించిన రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి ఈ సందర్భంగా శివరాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వార్డు సభ్యుల సమస్యల పరిష్కారానికి,ఫోరం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ ప్రజా రాజకీయాలకు చిరునామా ఏచూరి

**:చలామాల విఠల్ రావు(సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు)**

**గల్లీ నుండి డిల్లీ దాకా ఐక్య కార్మికోద్యమాల రథసారధి" సీతారం: మల్లూరు చంద్రశేఖర్ (సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి)**



సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్13(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రంలోని ఎర్రా రామయ్య భవనం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మార్క్సిస్టు పార్టీ యోధుడు మచ్చలేని కమ్యూనిస్టు,అఖిల భారత మాజీ కార్యదర్శి అమరజీవి సీతారాం ఏచూరి వర్ధంతి ఆదివారం జరిగింది.

ముందుగా ఏచూరి చిత్రపటానికి కార్మికులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జరిగిన సభలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ దేశానికి పీవీ నరసింహారావు ప్రధానమంత్రి గా చేసి నూతన ఆర్థిక సంస్కరణలు తెచ్చి దేశాన్ని అధోగతి పాలు చేసినప్పటి నుండి కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు నుండి నిస్వార్థ ప్రజా రాజకీయాలను దేశంలో తెచ్చేదానికి లౌకిక,ప్రాంతీయ పార్టీలను కూటమిగా చేస్తూ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి సీతారం ఏచూరి అని కొనియాడారు.నిస్వార్థ ప్రజా రాజకీయాలకు ఏచూరి చిరునామాగా నిలిచారని గుర్తు చేశారు.అనంతరం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్మికుల,కర్షకుల, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు గల్లీ నుండి డిల్లీ దాకా ఐక్య ఉద్యమాలు చేయడానికి బావ సారూప్యత కలిగిన సంఘాలను ఒకతాటిపైకి తెచ్చి సీతారం ఏచూరి చేసిన కృషి మరువలేనిదని అన్నారు.మోడీ ప్రభుత్వం నాడు రైతాంగానికి ద్రోహం చేసే పద్ధతిలో తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయడం కోసం డిల్లీ సరిహద్దులలో 365 రోజుల ఐక్య కర్షక పోరు నిర్వహించిన దానిలో ఏచూరి కీలక పాత్ర పోషించారని మల్లూరు ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాజకీయాలకతీతంగా కార్మికులందరూ ఐక్యమై సీతారం ఏచూరి ఆశయాల సాధన కోసం నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాలలో పాల్గొనాలని చంద్రశేఖర్ కోరారు.ఈ కార్యక్రమంలో 50 మంది ఆటో రవాణా కార్మికులు పాల్గొన్నారు.

# అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ ఆసుపత్రిలో రేపటి నుంచి ఉచిత ఈఎన్‌టీ మెగా శిబిరం

**తెలుగు గళం న్యూస్ వరంగల్**




వరంగల్‌లోని అపోలో రీచ్ ఎన్ఎస్ఆర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 15 నుంచి 19 వరకు ఐదు రోజుల పాటు ఉచిత ఈఎన్‌టీ సర్జరీ మెగా ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.ప్రముఖ ఈఎన్‌టీ నిపుణులు డాక్టర్ ఆర్.శ్రవణ్ కుమార్ రోగులను స్వయంగా పరీక్షించి వైద్య సలహాలు,అవసరమైన చికిత్స అందిస్తారు.శిబిరంలో చెవి నొప్పి,వినికిడి లోపం,సైనసైటిస్,ముక్కు దిబ్బడ,గొంతు నొప్పి,ముక్కు నుంచి రక్తస్రావం వంటి సమస్యలకు పరీక్షలు నిర్వహిస్తారు.శిబిరంలో భాగంగా ఉచిత ఓపీ సేవలతో పాటు ఎండోస్కోపీ,వినికిడి,థైరాయిడ్,రక్త పరీక్షలపై 50 శాతం రాయితీ కల్పించనున్నారు.కొత్తపేట క్రాస్ రోడ్ (ఆరెపల్లి)లోని ఆసుపత్రిలో రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుంది.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది.వివరాలు,అపాయింట్‌మెంట్ల కోసం 94598 75555 నంబరులో సంప్రదించవచ్చు.

# వసతి గృహంపై బీజేపీ దుష్ప్రచారం మానుకోవాలి

**విద్యార్థుల భద్రత, వసతులపై మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ**

**విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది**

**సమస్య తెలిసిన వెంటనే మంత్రి సీతక్క స్పందించారు**

**విమర్శలు కాదు.. గిరిజన ప్రాంతాలకు అభివృద్ధి పనులు తెచ్చి చూపండి**

**అసత్య ప్రచారాలు మానుకుని ప్రజలకు వాస్తవాలు చెప్పాలి: జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు**





**తెలుగు గళం ఏటూరునాగారం సెప్టెంబర్ 13:**

ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల వసతి గృహ నిర్వహణపై బీజేపీ నాయకులు చేస్తున్న విమర్శలు వాస్తవాలను తెలుసుకోకుండా చేస్తున్న దుష్ప్రచారమని ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు అన్నారు. వాజేడు ప్రాంతంలో విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడంతో పాటు పాములు, తేళ్ల బెడద నేపథ్యంలో అధికారుల సూచనల మేరకు విద్యార్థులను ఏటూరునాగారం వసతి గృహానికి తరలించారని తెలిపారు. గత ఏడాది సుమారు 30 మంది విద్యార్థులు ఉన్న వసతి గృహంలో ఈ ఏడాది 252 మంది చేరడంతో ఒక్కసారిగా నీటి సరఫరా సమస్య ఏర్పడిందని, ఈ విషయాన్ని మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లగానే వెంటనే రూ.20 లక్షలు మంజూరు చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. ప్రస్తుతం విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం లేదని చిటమట రఘు స్పష్టం చేశారు. వసతి గృహ పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్నారని తెలిపారు. పరిపాలనా పరంగా అవసరమైన చర్యల్లో భాగంగా వసతి గృహ ప్రధానోపాధ్యాయురాలు కిరణ్మయి, గణిత ఉపాధ్యాయురాలు తిరుపతమ్మలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఏటూరునాగారం మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులను కోరిన విషయాన్ని కూడా బీజేపీ నాయకులు తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు ఉపయోగించుకోవడం కాకుండా వాస్తవ పరిస్థితులను తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు. మంత్రి సీతక్కను లక్ష్యంగా చేసుకుని అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని చిటమట రఘు బీజేపీ నాయకులను కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ ఏటూరునాగారం ప్రాంతానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో తీసుకువచ్చిన ప్రధాన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. అటవీ అనుమతుల కారణంగా గిరిజన గ్రామాల్లో ఇళ్లు, రహదారులు, తాగునీటి వంటి అభివృద్ధి పనులకు ఎదురవుతున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వ స్థాయిలో పరిష్కరించేందుకు బీజేపీ నాయకులు చొరవ చూపాలని సూచించారు. మంత్రి సీతక్కపై అసత్య ప్రచారాలు చేయడం కాకుండా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేసి ప్రజల విశ్వాసం పొందాలని చిటమట రఘు అన్నారు.

# పలువురు మృతుల దశదినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

**తెలుగుగళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**



రేగొండ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన గోగుల సౌందర్య, గడ్డం జంపయ్యల దశదినకర్మ కార్యక్రమాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. ఆయా కుటుంబాలను ఆయన పరామర్శించి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ మనోధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో కోటంచ దేవస్థాన ఆలయ చైర్మన్ ఎన్ఎస్ఆర్,మార్కెట్ చైర్మన్ కిష్టయ్య,మాజీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, సీనియర్ నాయకులు ఉమేష్ గౌడ్,ఏనుగు రవీందర్ రెడ్డి,మైస భిక్షపతి,ఎడ్ల మల్లారెడ్డి,మనోహర్ రెడ్డి,కొలేపాక సాంబయ్య,గోగుల అశోక్ రెడ్డి,కోయిల క్రాంతి,సామల సురేందర్,మేకల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నాగులమ్మ ఆలయంలో ఘనంగా పొట్ట పండుగ

**చిరుధాన్యాల పంటకు కృతజ్ఞతగా నాగులమ్మకు నైవేద్యం**

**ఎన్ను కట్టడం కార్యక్రమంతో ఆదివాసీ ఆచారాలను ఘనంగా నిర్వహించిన పూజారులు**

**ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా పొట్ట పండుగ**

**నాగులమ్మ ఆలయంలో సమ్మక్క--సారలమ్మ తదితర గద్దెలకు చిరుధాన్యాల దండలతో ప్రత్యేక పూజలు**




**తెలుగు గళం మంగపేట, ములుగు, సెప్టెంబర్ 13:**

ములుగు జిల్లా మంగపేట మండలంలోని వాగొడ్డుగూడెం గ్రామపంచాయతీ పరిధి లక్ష్మీ నరసాపురంలో కొలువై ఉన్న శ్రీ నాగులమ్మ ఆలయంలో ఆదివారం పొట్ట పండుగను ఆదివాసీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల ప్రకారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పూజారులు, వడ్డెలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పొట్ట పండుగలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని అమ్మవారికి సంబంధించిన స్తంభాలు, గద్దెలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగా పండిన చిరుధాన్యాలతో నైవేద్యం తయారు చేసి, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ (దేవరవాల) ఇంటి నుంచి డోలి వాయిద్యాల నడుమ ఆలయానికి తీసుకువచ్చి నాగులమ్మ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. పొట్ట పండుగలో ముఖ్య ఘట్టమైన ఎన్ను కట్టడం కార్యక్రమాన్ని ఆదివాసీ పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పొట్ట దశలో ఉన్న వివిధ రకాల చిరుధాన్యాలను దండలుగా కట్టి నాగులమ్మ అమ్మవారి స్తంభంతో పాటు సమ్మక్క, సారలమ్మ, గడికామరాజు, పగిడిద్దరాజు, గోవిందరాజు, ఎర్రమ్మ, పోతురాజుల గద్దెలపై ఉన్న స్తంభాలకు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో డోలి వాయిద్యాల నడుమ ఆదివాసీ పూజారులు జాగారం నిర్వహించారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆదివాసీ ఆచారాలు, సంస్కృతి, ప్రకృతితో ముడిపడిన విశ్వాసాలను కాపాడుకోవడంలో ఇటువంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని భక్తులు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ ట్రస్ట్, ఆలయ ప్రధాన పూజారి బాడిశ రామకృష్ణ స్వామీజీ (దేవరవాల), నాగులమ్మ ప్రధాన పూజారి బాడిశ నాగ రమేష్, నవీన, వడ్డెలు సోడే సత్యం, కుర్సం పుల్లయ్య, మడకం రమేష్, మడకం రాజేష్, శౌలం శాంత, కుర్సం వీరమ్మ, భవాని, మడకం నాగమణి, సంధ్య, సుప్రజ, సోడి శ్రీను, కుర్సం నాగ సాంబయ్య తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణకు బీఆర్ఎస్ నాయకులు అండగా ఉండాలి

**గచ్చిబౌలి డివిజన్‌లో బూత్ లెవెల్ సమీక్షా సమావేశం**



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 13 (తెలుగు గళం)**

గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బూత్ లెవెల్ కార్యకర్తలు, బీఎల్‌వోలు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ఓటరు నమోదు కార్యక్రమంలో ఓట్లు కోల్పోయిన వారికి అండగా నిలవాలని నాయకులకు సూచించారు. ఓటర్లకు నోటీసులు అందిన సందర్భంలో వారికి సరైన అవగాహన కల్పించి, అవసరమైన గుర్తింపు పత్రాలతో సంబంధిత బిఎల్వో అధికారులను సంప్రదించేలా సహకరించాలని దిశానిర్దేశం చేశారు.ఓటు హక్కుకు సంబంధించిన నిబంధనలు, ప్రక్రియపై అవగాహన లేని ప్రజలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.బూత్ స్థాయిలో ఓటర్ల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నాయకులకు సూచించారు.

# మట్టి గణపతుల పంపిణీ చేసిన 14వ వార్డు కౌన్సిలర్



**స్టేషన్ ఘనపూర్, తెలుగుగళం, సెప్టెంబర్ 13:**

స్టేషన్ టెంపుల్ మున్సిపాలిటీలో 14వ వార్డు కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.పర్యావరణ సంరక్షణని దృష్టిలో పెట్టుకొని మట్టి గణపతులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అనే లక్ష్యంగా భక్తులకు ఉచితంగా గణపతులను ఇవ్వడం జరిగింది. భక్తులు ఉత్సాహంగా మట్టి విగ్రహాలు తీసుకోవడానికి ముందుకు వచ్చి పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో ఉత్సాహంగా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పెసరు కృష్ణవేణి సారయ్య,గడ్డాల శేఖర్, గట్టు సురేందర్,వల్లాల గోపి, లత, అశోక్,పద్మ, కొంగరి రమేష్,వల్లాల పల్లవి, నిర్మల, సౌమ్య, రుద్రమదేవి, రమ, పెండ్యాల నరసయ్య, రాజమ్మ, స్వామి పాల్గొన్నారు.

# ధ్రువ్ విక్రమ్ 'జాకీ'




వెండితెరపై విలక్షణ నటనతో సరికొత్త ముద్ర వేసుకున్న కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ వారసుడు ధ్రువ్ విక్రమ్ తన కెరీర్‌ను పరుగులు పెట్టించేందుకు బిగ్గెస్ట్ ప్లాన్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఇప్పటివరకు చేసిన ఎమోషనల్ అండ్ ఇంటెన్స్ చిత్రాలకు పూర్తి భిన్నంగా, ఈసారి ఆయన పక్కా మాస్ యాక్షన్ రూట్ ఎంచుకున్నారు. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ 'మైత్రీ మూవీ మేకర్స్' బ్యానర్‌లో ధ్రువ్ విక్రమ్ హీరోగా తెరకెక్కుతున్న సరికొత్త చిత్రానికి సంబంధించిన సినిమా టైటిల్ అధికారికంగా బయటికి వచ్చింది. ఈ చిత్రానికి మేకర్స్ 'జాకీ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ క్రేజీ అప్‌డేట్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటిస్తూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినీ వర్గాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది. "జాకీ – నో రీటేక్స్ అలౌడ్" అనే క్యాచీ ట్యాగ్‌లైన్‌తో సినిమాపై ఉన్న అంచనాలను ఒక్కసారిగా పెంచేశారు. థియేటర్లలో ప్రేక్షకులకు విజిళ్లు వేయించే ఔట్ అండ్ ఔట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలచబోతున్నామని, ఇది తమ ప్రామిస్ అంటూ యూనిట్ స్పష్టం చేసింది. ధ్రువ్ విక్రమ్‌ను మునుపెన్నడూ చూడని సరికొత్త మాస్ అవతారంలో ఈ సినిమాలో ప్రజెంట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది.

పాన్-ఇండియా స్థాయిలో భారీ విజయాలు అందుకుంటున్న మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం సినిమాకు అతిపెద్ద బలంగా మారింది. టాలెంటెడ్ డైరెక్టర్ కరణ్ ఎ.కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, తన అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, చార్ట్‌బస్టర్ సాంగ్స్‌తో క్రేజ్ సంపాదించుకున్న స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్నారు. సంతోష్ నారాయణన్ ఇచ్చే మాస్ బీట్స్‌కు ధ్రువ్ విక్రమ్ స్క్రీన్ ప్రజెన్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద విజిల్స్ పడటం ఖాయమని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక స్టార్ హీరో వారసుడు, టాలీవుడ్‌లోని టాప్ బ్యానర్, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ కలయికలో వస్తున్న 'జాకీ' కోలీవుడ్‌తో పాటు తెలుగునాట కూడా మంచి హైప్‌ను క్రియేట్ చేస్తోంది. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వివరాలు, హీరోయిన్, ఇతర నటీనటుల సమాచారాన్ని మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.



# బన్నీ-బాసిల్ కాంబోకు బిగ్ క్లూ!

పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద తనకంటూ ఒక తిరుగులేని సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అడుగులు ఇప్పుడు మరింత దూకుడుగా మారాయి. వరుస భారీ ప్రాజెక్టులతో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న బన్నీ, ఇప్పుడు తన మైల్ స్టోన్ ఫిల్మ్ '#AA24' కోసం ఎలాంటి జోనర్ ఎంచుకుంటారు? డైరెక్టర్ ఎవరు? అనే ప్రశ్నలు గత కొంతకాలంగా టాలీవుడ్‌ను ఊపేస్తున్నాయి. అయితే తాజాగా నెట్టింట ప్రత్యక్షమైన ఒకే ఒక్క ఫొటో సినీ ప్రియుల అనుమానాలను దాదాపు నిజం చేస్తూ, సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. మలయాళ చిత్రసీమలో సూపర్ హీరో సబ్జెక్ట్‌తో ఇండియన్ సినిమా దృష్టిని తనవైపు తిప్పుకున్న 'మిన్నల్ మురళి' దర్శకుడు బాసిల్ జోసెఫ్. ఆయనతో కలిసి పలు సంచలన చిత్రాలకు కలం పట్టిన స్టార్ కో-రైటర్ అరుణ్ అనిరుధన్ తాజాగా పెట్టిన ఒక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో కార్చిచ్చు రేపింది. అల్లు అర్జున్‌కు అత్యంత ఇష్టమైన లగ్జరీ కార్ రేంజ్ రోవర్ 'బీస్ట్' వద్ద దిగిన ఫొటోను అరుణ్ పంచుకోవడమే ఇందుకు కారణం. బన్నీ సొంత వాహనం దగ్గర, ఆయన వ్యక్తిగత ప్రాంగణంలో 'మిన్నల్ మురళి' రైటర్ కనిపించడంతో నెటిజన్లు ఒక్కసారిగా డాట్స్ కనెక్ట్ చేయడం స్టార్ట్ చేశారు.

కొంతకాలంగా అల్లు అర్జున్ – బాసిల్ జోసెఫ్ కాంబో ఓ భారీ బడ్జెట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రూపుదిద్దుకోనుందంటూ ఫిలింనగర్ సర్కిల్స్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు బాసిల్ రైటింగ్ టీమ్ నేరుగా బన్నీ అడ్డాలోకి ఎంట్రీ ఇవ్వడంతో, కథా చర్చలు కేవలం మాటలకే పరిమితం కాలేదని.. తుది దశకు చేరిపోయాయని స్పష్టమవుతోంది. ఐకాన్ స్టార్ ఇమేజ్‌కు తగ్గట్టుగా బాసిల్ బృందం ఓ సరికొత్త కంటెంట్‌తో కూడిన విభిన్నమైన స్టోరీని రెడీ చేసిందని, గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అరుణ్ అనిరుధన్ లాంటి టాలెంటెడ్ రైటర్ పవర్ఫుల్ స్క్రిప్ట్, బాసిల్ జోసెఫ్ సరికొత్త నేరేషన్, వీటన్నింటికీ తోడు అల్లు అర్జున్ మాస్ అండ్ స్టైలిష్ స్క్రీన్ ప్రెజెన్స్ కలిస్తే థియేటర్లలో విధ్వంసం ఏ రేంజ్‌లో ఉంటుందో అని ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు. కేవలం ఒకే ఒక్క ఇన్‌స్టా పిక్‌తో '#AA24' హైప్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడితే ఇండియన్ సినీ చరిత్రలోనే మరో బిగ్గెస్ట్ అనౌన్స్‌మెంట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 'వారణాసి'కి లీక్ షాక్!



దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు క్రేజీ కాంబోపై ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతటి ఆసక్తితో ఉన్నారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. వీరిద్దరి కలయికలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న అడ్వెంచరస్ ప్రాజెక్ట్ 'వారణాసి' చుట్టూ రోజుకో ఆసక్తికరమైన వార్త హల్‌చల్ చేస్తూనే ఉంది. అయితే తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్ నుంచి బయటకు వచ్చినట్లు చెబుతున్న ఒకే ఫోటో ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. ఊహకందని కాన్సెప్ట్‌తో జక్కన్న రెడీ చేస్తున్న సరికొత్త విజువల్ వండర్ ఇదేనంటూ నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు. సాధారణంగా లీకయ్యే ఫోటోల్లో హీరో లుక్ లేదా లొకేషన్ సెటప్ కనిపించడం నార్మల్. కానీ 'వారణాసి' సెట్ నుంచి లీకైన పిక్ మాత్రం ఎవరూ కలలో కూడా ఊహించని సరికొత్త సంచలనానికి తెరలేపింది. పురాతన కళావైభవంతో నిర్మించిన భారీ ఆలయ నేపథ్యం.. సరిగ్గా అదే ప్రాంగణంలో కళ్లు చెదిరే సైజులో కనిపిస్తున్న ఓ భారీ డైనోసార్ ఆకారం. ఈ వింత కలయిక చూసి సోషల్ మీడియాలో నెటిజన్లు తలపట్టుకుంటున్నారు. దైవత్వానికి ప్రతీకగా నిలిచే ఒక పవిత్ర దేవాలయ సెట్‌లో, చరిత్ర పూర్వ యుగానికి చెందిన భయంకర డైనోసార్ ఏం చేస్తోందనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

రాజమౌళి ఆలోచనలు ఎప్పుడూ రొటీన్ ఫార్ములాకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఫారెస్ట్ అడ్వెంచర్ స్టోరీతో సాగే ఈ ప్రాజెక్ట్‌లో టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్ ఉందా? లేక మన పురాణాలలోని అంతుచిక్కని రహస్యాలను, డైనోసార్ల కాలం నాటి పరిణామ క్రమాన్ని ముడిపెడుతూ ఏమైనా సరికొత్త కథ అల్లుతున్నారా? అనే సరికొత్త చర్చలను నెటిజన్లు తెరపైకి తెస్తున్నారు. ఇండియానా జోన్స్ తరహా గ్లోబల్ అడ్వెంచర్‌గా ప్రచారం అవుతున్న ఈ చిత్రంలో మైథాలజీతో పాటు సైన్స్ ఫిక్షన్‌ను కూడా జక్కన్న సమపాళ్లలో మిళితం చేస్తున్నారనే ఊహాగానాలకు ఈ లీక్ మరింత బలాన్నిచ్చింది. ఇప్పటికే భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ప్రాజెక్టుల్లో ముందు వరుసలో నిలుస్తున్న ఈ సినిమాపై తాజా లీక్‌తో హైప్ పతాక స్థాయికి చేరింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్, అడ్వెంచర్‌కు మన నేటివిటీని జోడించడంలో రాజమౌళి స్టైలే వేరు. ఆలయం బ్యాక్‌డ్రాప్‌లో డైనోసార్ దృశ్యం వెండితెరపై ఎలా ఆవిష్కృతం కాబోతోందో ఊహించుకోవడానికే రోమాలు నిక్కబొడుచుకుంటున్నాయంటూ మహేష్ బాబు అభిమానులు సంబరపడిపోతున్నారు. అధికారికంగా చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అప్‌డేట్ రాకపోయినా, ఈ ఒక్క లీక్డ్ పిక్ మాత్రం గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద మహేష్ – జక్కన్న సృష్టించబోయే విధ్వంసానికి ట్రైలర్‌లా మారిపోయిందని కామెంట్స్ చేస్తున్నారు.

# బేబీ బంప్‌తో సామ్ కొత్త లుక్!



నటి సమంత రూత్ ప్రభు తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన దశను ఆస్వాదిస్తున్నారు. భర్త, దర్శకుడు రాజ్ నిడిమోరుతో కలిసి తొలి బిడ్డకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న ఆమె.. ప్రెగ్నెన్సీ సమయంలోనూ తన వర్క్‌ను కొనసాగిస్తూ అభిమానులకు ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటున్నారు. తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. కొన్ని మిర్రర్ సెల్ఫీల్లో తన పెరుగుతున్న బేబీ బంప్‌ను సమంత స్వయంగా చూపించడంతో అభిమానుల దృష్టి మొత్తం ఆ ఫోటోలపైనే పడింది. తాజా ఫోటోల్లో సమంత చాలా సింపుల్‌గా, నేచురల్‌గా కనిపించారు. రిలాక్స్‌డ్‌గా తీసుకున్న సెల్ఫీలను ఆమె అభిమానులతో పంచుకున్నారు. ప్రెగ్నెన్సీ కారణంగా తన పనికి బ్రేక్ ఇవ్వకుండా, వీలైనంత యాక్టివ్‌గా ఉంటూ ఈ కొత్త దశను ఆస్వాదిస్తున్నట్లు ఆమె ఫోటోలు చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా బేబీ బంప్‌తో కనిపించిన ఫోటోలు అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి.

ఇటీవలే మాతృత్వం గురించి సమంత చేసిన వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పిల్లలు కలిగినా, కలగకపోయినా దాన్ని ప్రశాంతంగా అంగీకరించడానికి తాను, రాజ్ ఇద్దరూ సిద్ధంగా ఉన్నామని చెప్పిన సమంత.. ఇప్పుడు తమ జీవితంలోకి ఈ వార్త రావడం నిజంగా ఒక సర్‌ప్రైజ్ అని వెల్లడించారు. సమంత, రాజ్ నిడిమోరు కలిసి గతంలో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' వంటి ప్రాజెక్టుల కోసం పనిచేశారు. వీరి మధ్య ప్రేమ గురించి 2024లో పలు వార్తలు వచ్చినప్పటికీ, ఇద్దరూ తమ వ్యక్తిగత జీవితాన్ని చాలాకాలం ప్రైవేట్‌గానే ఉంచారు. చివరకు 2025 డిసెంబర్ 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్‌లోని లింగ భైరవి ఆలయంలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వివాహం చేసుకున్నట్లు వెల్లడైంది. ప్రస్తుతం సమంత సినిమాలతో పాటు టెలివిజన్ రంగంలోనూ బిజీగా ఉండేందుకు సిద్ధమవుతున్నారు. సోనీ లివ్‌లో ప్రసారం కానున్న 'సెలబ్రిటీ మాస్టర్‌చెఫ్ తమిళ్' రియాలిటీ షోకు ఆమె హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. మరోవైపు తన ప్రెగ్నెన్సీ ప్రయాణానికి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని అభిమానులతో పంచుకుంటున్న సమంత.. తాజాగా బేబీ బంప్‌తో కనిపించిన ఫోటోలతో మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.